క్లుప్తంగా

16న హుండీ లెక్కింపు

మానకొండూర్: గట్టుదుద్దెనపల్లి శ్రీప్రసన్నాంజనేయస్వామి ఆలయ హుండీ లెక్కింపు ఈనెల 16న ఉదయం 10 గంటలకు నిర్వహిస్తున్నట్లు ఈవో మారుతి ఒక ప్రకటనలో తెలిపారు.

ఫొటో ట్రేడ్ ఎక్స్‌పోను సద్వినియోగం చేసుకోవాలి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న రవి

రామడుగు: ఈనెల 19 నుంచి 21 వరకు హైదరాబాద్‌లోని ఓమ్ కన్వెన్షన్ హాల్‌లో నిర్వహించే ఫొటో ట్రేడ్ ఎక్స్‌పో కార్యక్రమాన్ని ప్రతీ ఫొటోగ్రాఫర్ సద్వినియోగం చేసుకోవాలని ఫొటో, వీడియోగ్రాఫర్స్ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిరి రవి కోరారు. మండల కేంద్రంలోని వైశ్య భవన్‌లో బుధవారం ఎక్స్‌పో వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు తుమ్మ చందు, కోశాధికారి మధుసూదన్‌గౌడ్, పీఆర్‌వో పురం విక్రమ్, రామడుగు మండల అధ్యక్షుడు బుర్ర కృష్ణ, ప్రధాన కార్యదర్శి గుర్రం సురేశ్, ప్రతినిధులు కరబూజ ప్రవీణ్‌కుమార్, గోపు రాజిరెడ్డి, రాజేశ్, నర్సింగం, సంతోష్, శ్రీనివాస్, రమేశ్, రత్నాకర్‌రెడ్డి, మహేశ్ పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు ప్రారంభం



బోరు ప్రారంభిస్తున్న రమణారెడ్డి

ఇల్లందకుంట: పాతర్లపల్లి, కనగర్తి, సిరిసేడు, సీతంపేట, శ్రీరాములపల్లి గ్రామాల ప్రజల సౌకర్యార్థం కేంద్ర మంత్రి బండి సంజయ్‌కుమార్ ఎంపీ నిధులతో వేయించిన 7 బోర్లను బుధవారం బీజేపీ మండలాధ్యక్షుడు బైరెడ్డి రమణారెడ్డి ఆధ్వర్యంలో ప్రారంభించారు. నాయకులు అబ్బిడి చంద్రారెడ్డి, చల్లూరి కుమార్, బైరెడ్డి తిరుపతిరెడ్డి, కారోబార్ రామ్ తిరుపతి, బైరెడ్డి ప్రణీత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్రీడాపోటీలు షురూ



కబడ్డీ ఆడుతున్న హెచ్‌ఎం రాజిరెడ్డి

చొప్పదండి: మండలస్థాయి ఎస్‌జీఎఫ్ బాలికల క్రీడాపోటీలను పట్టణంలోని క్రీడామైదానంలో ఎంఈవో మోహన్, బాలుర ఉన్నత పాఠశాల హెచ్‌ఎం వైద్యుల రాజిరెడ్డి బుధవారం ప్రారంభించారు. బాలికలకు ఖోఖో, కబడ్డీ, వాలీబాల్ పోటీలను అండర్–17, 14 విభాగాల్లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి వేణుగోపాల్, మండల కార్యదర్శి కొమురోజు కృష్ణ, చంద్రశేఖర్, రాజ్‌కుమార్, స్నేహలత, స్వప్న, ఆస్మా తదితరులు పాల్గొన్నారు.

సన్మానం



చొప్పదండి: ఉపాధ్యాయులను సన్మానించిన ఎంఈవో మోహన్ తదితరులు

చొప్పదండి: మండలంలో ఎంపికైన ఉత్తమ ఉపాధ్యాయులను ఎంఈవో మోహన్ ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా సన్మానించారు. పట్టణంలోని జిల్లాపరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో మెమొంటోలు, సర్టిఫికెట్లు అందజేశారు. వైద్యుల రాజిరెడ్డి, ఇప్పనపల్లి సాంబయ్య, ప్రధానోపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



ఎంఈవో రంగనాథశర్మను సన్మానిస్తున్న జగన్‌మోహన్‌గౌడ్

రామడుగు: మండల విద్యాధికారిగా బాధ్యతలను స్వీకరించిన రంగనాథశర్మను బుధవారం ట్రస్మా మండల నాయకులు సన్మానించారు. అధ్యక్షుడు జగన్‌మోహన్‌గౌడ్, ప్రతినిధులు ఉప్పుల శ్రీనివాస్, రాజశేఖర్, తోట కిరణ్, మునీందర్, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

సంపత్‌రెడ్డికి పురస్కారం

వీణవంక: తెలుగు భాషా అభివృద్ధికి విశేష సేవలందించిన వీణవంక జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు పెద్ది సంపత్‌రెడ్డికి కాళోజీ పురస్కారం లభించింది. కరీంనగర్‌లోని అల్ఫోర్స్ ఈటెక్నో స్కూల్లో జరిగిన కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే చేతుల మీదుగా అవార్డు స్వీకరించారు. మండల విద్యాధికారితోపాటు ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు. అల్ఫోర్స్ అధినేత నరేందర్‌రెడ్డి, హెచ్‌ఎం పులి అశోక్‌రెడ్డి, ఉపాధ్యాయులున్నారు.

నిర్వహణ మరిచారు..




చెంజర్లలో అధ్వానంగా మరుగుదొడ్డి



తాడికల్‌లో చుట్టూ చెట్లు, మొక్కలతో..

- రైతు వేదికల్లో అధ్వానంగా మరుగుదొడ్లు
- నల్లా కనెక్షన్ లేదు
- ఇబ్బంది పడుతున్న మహిళా రైతులు, ఉద్యోగినులు
- నిర్వహణ భారం ఏఈవోలపైనే..
- వేదికల చుట్టూ పెరిగిన పిచ్చి మొక్కలు
- ఆందోళనలో ఉద్యోగులు

మానకొండూర్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా క్లస్టర్‌కో రైతు వేదికను రైతు శ్రేయస్సు దృష్ట్యా నిర్మించింది. నియోజకవర్గంలోని మండలాల్లో క్లస్టర్ గ్రామాలవారీగా రైతు వేదికలు నిర్మించగా.. నిర్వహణ లేకపోవడంతో రైతు వేదికలు అధ్వానంగా మారాయి. ఒక్కో రైతు వేదికకు ప్రభుత్వం రూ.18లక్షల నుంచి రూ.26లక్షల వెచ్చించింది. ఈ వేదికల వద్ద నిర్వహణ లేక అధ్వానంగా దర్శనమిస్తున్నాయి. ప్రభుత్వ కార్యకలాపాలతోపాటు రైతు సమావేశాలు నిర్వహించుకునేలా, వ్యవసాయాధికారులు ఈ వేదికల నుంచే విధులు చేపట్టేలా వేదికలు రూపుదిద్దుకున్నాయి. స్థలాల కొరతతో కొన్ని వేదికలు ఊరి



నుస్తులాపూర్‌లో అపరిశుభ్రంగా..

బయట, మరికొన్ని స్థలాలున్న చోట కాంట్రాక్టర్లు నిర్మించారు. ఆయా గ్రామాల్లో గత ప్రభుత్వంలో హడావుడిగానే వేదికలు ప్రారంభించగా.. ప్రస్తుతం నిర్వహణ లేక.. నీటి సౌకర్యం కల్పించక అధ్వానంగా మారాయి.

కీలకం..

ప్రభుత్వం నిర్వహించే వీడియో కాన్ఫరెన్సు, ప్రభుత్వ అధికారులు నిర్వహించే వివిధ సమావేశాలకు గ్రామాల్లోని వేదికలు కీలకంగా మారాయి. ప్రస్తుతం వేదికల ఆవశ్యకత పెరిగిందని చెప్పొచ్చు. ప్రతీ వ్యవసాయాధికారి ఇక్కడి నుంచే తమ విధులు నిర్వహిస్తున్నారు. క్లస్టర్ గ్రామాల్లో నిర్మించిన ఈ వేదికలు ఎంతో ఉపయోగకరంగా ఉండగా.. నిర్వహణ లోపంతో అస్తవ్యస్తంగా మారాయి.

నీటి సౌకర్యమేది..

ఈ వేదికలకు పంచాయతీ పైపులైన్ లేక మిషన్ భగీరథ పైపులైన్ ద్వారానైనా నీటి సౌకర్యం కల్పించాల్సి ఉన్నా.. ఏళ్లు గడుస్తున్నా ఇంతవరకు నీటి సౌకర్యం కల్పించలేదు. మరుగుదొడ్లు, వాష్ రూంలకైనా నీటి సౌకర్యం కల్పించకపోవడంతో.. మహిళా రైతులు, ఉద్యోగినులకు ఇబ్బంది తప్పడం లేదు. కొందరు మరుగుదొడ్ల తలుపులు ఎత్తుకెళ్లడం, పగలకొట్టడం చేస్తున్నారు.

నిర్వహణ భారం ఉద్యోగులదే..

వేదికలను శుభ్రంగా ఉంచేందుకు స్వీపర్లను వ్యవసాయాధికారులే సొంత ఖర్చుతో ఏర్పాటు చేసుకుంటున్నారు. వేదికల్లో వస్తు సామగ్రి రూ.లక్షల్లో ఉన్నా.. సీసీ కెమెరాలు లేవు. వాచ్‌మెన్లు సైతం కానరారు.



హుజూరాబాద్‌లో ఐలమ్మ విగ్రహానికి నివాళి అర్పిస్తున్న నాయకులు



తిమ్మాపూర్‌లో నివాళి అర్పిస్తున్న నాయకులు



జమ్మికుంట: నినాదాలు చేస్తున్న నాయకులు

చాకలి ఐలమ్మకు నివాళి

హుజూరాబాద్: తెలంగాణ వీర వనిత చాకలి ఐలమ్మ వర్ధంతి బుధవారం నిర్వహించారు. పట్టణంలోని జమ్మికుంట రోడ్‌లో ఉన్న చాకలి ఐలమ్మ విగ్రహానికి మున్సిపల్ కమిషనర్ సమ్మయ్య, బీసీ ఆజాది ఫెడరేషన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కుడికాల భాస్కర్, జిల్లా అధ్యక్షుడు చిలుకమారి శ్రీనివాస్, డివిజన్ అధ్యక్షుడు పంజాల తిరుపతిగౌడ్, రజక సంఘం నాయకులు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. హనుమాన్ దేవాలయం చైర్మన్ కొల్లిపాక శంకర్, పద్మశాలీ సేవాసమితి అధ్యక్షుడు వేముల యాదగిరి, జునుకల లక్ష్మణరావు, సబ్బని శివాజీ పాల్గొన్నారు.

తిమ్మాపూర్: మండలంలోని పలు గ్రామాల్లో ఐలమ్మ చిత్ర పటానికి రజక సంఘం నాయకులు పూలమాల వేసి నివాళి అర్పించారు.

జమ్మికుంట: పట్టణంలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం హుజూరాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఇంగిలే రామారావు, చాణక్య డిగ్రీ, పీజీ కళాశాలలో రజక సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి రవీందర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. పింగిళి రాకేశ్, ఎండీ సలీం, అశోక్, వెంకటేశ్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రామడుగు: గోపాల్‌రావుపేట జెండా చౌరస్తా వద్ద నిర్వహించారు. రజక సంఘం అధ్యక్షుడు పైండ్ల హన్మంతు, లింగంపల్లి అంజయ్య, పైండ్ల తిరుపతి, పున్న కనకయ్య తదితరులు పాల్గొన్నారు.

శంకరపట్నం: కేశవపట్నంలో అధికారులు, మాజీ ప్రజాప్రతినిధులు నివాళి అర్పించారు. రజక సంఘం మండల అధ్యక్షుడు తిరుపతి, తహసీల్దార్ సురేఖ, మాజీ జెడ్పీటీసీ బత్తిని శ్రీనివాస్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు మహిపాల్ పాల్గొన్నారు.

చిగురుమామిడి: రేకొండ గ్రామంలో కాంగ్రెస్ నాయకులు నిర్వహించారు. మాజీ జెడ్పీటీసీ గీకురు రవీందర్, మాజీ సర్పంచ్ పిట్టల రజిత, డీసీసీ ప్రధాన కార్యదర్శి చిటుమల్ల రవీందర్, జిల్లా అధికార ప్రతినిధి ఐరెడ్డి సత్యనారాయణరెడ్డి, రజక సంఘం అధ్యక్షుడు దుడ్డేల రంగయ్య, సింగిల్‌విండో డైరెక్టర్లు కూతురు రవీందర్‌రెడ్డి, తాళ్లపల్లి తిరుపతి, మాజీ ఎంపీటీసీ చీల లక్ష్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇల్లందకుంట: మండల కేంద్రంలో రజక సంఘం మండల అధ్యక్షుడు రావుల ఎల్లయ్య ఆధ్వర్యంలో నిర్వహించారు. సింగిల్‌విండో వైస్ చైర్మన్ కందాల కొమురెల్లి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పెద్ది కుమార్, సీనియర్ నాయకుడు కనుమల్ల సంపత్, మాజీ సర్పంచ్ పోడేటి రామస్వామి, మాజీ ఎంపీటీసీ దంసాని విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సైదాపూర్: మండల కేంద్రంలో రజక సంఘం నాయకులు నిర్వహించారు. బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు సోమారపు రాజయ్య, గోపిరాజు సమ్మయ్య, మునిగంటి సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ పహారాలో యూరియా పంపిణీ

వీణవంక: నర్సింగాపూర్ గ్రామంలో గోదాం వద్ద యూరియా పంపిణీ గందరగోళానికి దారి తీసింది. ప్యాక్స్ ఆధ్వర్యంలో 450 బస్తాల యూరియా రాగా.. 800 మందికి పైగా రైతులు బుధవారం ఉదయం 5 గంటలకే కార్యాలయం వద్దకు చేరుకున్నారు. ఆధార్ కార్డుల ప్రకారం రైతుల వద్ద సిబ్బంది సేకరించగా.. సరిపడా యూరియా రాకపోవడంతో ఉద్రిక్తతకు దారి తీసింది. ఎస్సై ఆవుల తిరుపతి కేంద్రం వద్దకొచ్చి రైతులతో మాట్లాడారు. కేంద్రం వద్ద మంచినీటి వసతి లేకపోవడంతో రైతులు ఇబ్బంది పడ్డారు. వ్యవసాయ అధికారుల నిర్లక్ష్యంతో ఈ దుస్థితి వచ్చిందని వాపోయారు. ప్రతీ గ్రామానికి ఒక లారీని కేటాయిస్తే ఈ ఇబ్బంది ఉండేది కాదని పేర్కొన్నారు.



నర్సింగాపూర్‌లో పోలీసుల పర్యవేక్షణలో యూరియా పంపిణీ

మంత్రిని కలిసిన నాయకులు



హుజూరాబాద్: హైదరాబాద్‌లో మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబును ఆయన కార్యాలయంలో బుధవారం బ్రాహ్మణ పరిషత్ సంఘం నాయకులు మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. విదేశీ విద్య కోసం 2023లో దరఖాస్తు చేసి ఎంపికైన విద్యార్థులు చదువు పూర్తి చేసుకున్నా.. ఇప్పటివరకు విదేశీ విద్య నిధి పథకం కింద నిధులు మంజూరు కాలేదన్నారు. డాక్టర్ విష్ణుదాస్ గోపాల్‌రావు, సంపత్‌కుమార్, చిట్టంపల్లి ఉపేందర్ ఉన్నారు.



మంత్రికి పుష్పగుచ్ఛం అందిస్తున్న అందె స్వామి

చిగురుమామిడి: మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌ను సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు అందె స్వామి, జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్ బుధవారం ఎల్‌ఎండీలో కలిసి పుష్పగుచ్ఛమందించారు. ఎస్సీ, ఎస్టీ సమస్యలను పరిష్కరించాలని కోరినట్లు చెప్పారు. గూడెం లక్ష్మి, బూడిద సదాశివ ఉన్నారు.

జిల్లాస్థాయి సైన్స్ సెమినార్



వివరిస్తున్న విద్యార్థి

కరీంనగర్: నగరంలోని జిల్లా సైన్స్ మ్యూజియంలో బుధవారం జిల్లాస్థాయి సైన్స్ సెమినార్ నిర్వహించారు. 93 పాఠశాలల నుంచి 93 మంది విద్యార్థులు పాల్గొని క్వాంటమ్ యుగం ప్రారంభమైంది–అవకాశాలు, సవాళ్లు అంశంపై ప్రదర్శించారు. ఈ సందర్భంగా జిల్లా సైన్స్ అధికారి చాడ జయపాల్‌రెడ్డి మాట్లాడుతూ.. సెమినార్‌లో ప్రథమస్థానంలో నిలిచిన విద్యార్థిని ఈనెల 18న హైదరాబాద్‌లో జరిగే రాష్ట్రస్థాయి సైన్స్ సెమినార్‌కు పంపిస్తామని అన్నారు. వివిధ పాఠశాలల గైడ్ ఉపాధ్యాయులు పాల్గొని విద్యార్థులకు మార్గదర్శకత్వం వహించారు. ఫిజిక్స్ జూనియర్ లెక్చరర్లు గంగారెడ్డి, రవి జడ్జీలుగా వ్యవహరించి విద్యార్థుల ప్రదర్శనలను సమీక్షించారు. గౌతమ్(మోడల్ స్కూల్ రుక్మాపూర్) ప్రథమ, మీసాల శ్రీహిత(అల్ఫోర్స్ హైస్కూల్) ద్వితీయ, ఎస్.సుశీల్‌కుమార్(భగవతి స్కూల్) తృతీయ స్థానాలు సాధించారు. జిల్లా క్వాలిటీ కోఆర్డినేటర్ కర్ర అశోక్ రెడ్డి, జిల్లా ప్లానింగ్ కోఆర్డినేటర్ మిలుకూరి శ్రీనివాస్, డీసీఈబీ కార్యదర్శి భగవంతయ్య, టాస్ కోఆర్డినేటర్ నాగేశ్వర్‌రావు పాల్గొన్నారు.

జాయింట్ రీప్లేస్‌మెంట్‌కు భయపడొద్దు



మాట్లాడుతున్న డాక్టర్ వేణుగోపాల్

కరీంనగర్‌టౌన్: మోకాళ్ల నొప్పులతో బాధపడేవారు జాయింట్ రీప్లేస్‌మెంట్ చేయించుకునేందుకు భయపడొద్దని కరీంనగర్ మెడికవర్ ఆసుపత్రి ఆర్థోపెడిక్ సర్జన్లు వేణుగోపాల్, రాకేశ్ అన్నారు. బుధవారం ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. శరీరంలోని అన్ని బాగాలకు చేస్తున్న సర్జరీల మాదిరిగానే మోకాలు, తుంటి సర్జరీల్లో అత్యాధునిక టెక్నాలజీ అందుబాటులోకి వచ్చిందన్నారు. 50 ఏళ్లు దాటిన వారిలో మోకాలు కీలు అరుగుదల సహజంగానే ఉంటుందని తెలిపారు. తుంటి జాయింట్ రీప్లేస్‌మెంట్‌తో 90శాతం సక్సెస్ రేట్ ఉందని, పెయిన్‌లెస్ సర్జరీలు అందుబాటులోకి వచ్చాయని, మోకాలు అరుగుదల సమస్యలుంటే స్పెషలిస్టు వైద్యులను సంప్రదించి చికిత్స తీసుకోవాలని సూచించారు. ఆసుపత్రి సెంటర్ హెడ్ గుర్రం కిరణ్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో అనెస్తీషియా హెడ్ డాక్టర్ వినయ్, సూపరింటెండెంట్ డాక్టర్ ప్రియాంక, మార్కెటింగ్ మేనేజర్ కోట కర్ణాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఓటరు తుది జాబితా విడుదల



ఓటరు జాబితా విడుదల చేస్తున్న ఎంపీడీవో

శంకరపట్నం: మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఓటరు తుది జాబితాను ఎంపీడీవో కృష్ణప్రసాద్ విడుదల చేశారు. మండలంలోని 13 ఎంపీటీసీ స్థానాలకు గాను ఓటరు జాబితాను అందుబాటులో ఉంచామన్నారు. కోరెం రాజిరెడ్డి, లక్ష్మణ్‌రావు పాల్గొన్నారు.



మానకొండూర్: చెంజర్ల నుంచి పెద్దూరుపల్లెకు వెళ్లే రోడ్డులో వర్షపు నీరు నిలిచి వాహనదారులు, కాలినడకన వెళ్లేవారు ఇబ్బంది పడుతున్నారు. వర్షపు నీటిని తొలగించాలని స్థానికులు అధికారులను కోరుతున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి
వెంకన్న, ఏఈ, పంచాయతీరాజ్, సెల్ నంబర్: 9440501432

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది.

మా ఫోన్ నంబర్లు: 9393557752, 9848408781, 8790144227

రైతులు అధైర్యపడొద్దు



ఎరువుల పంపిణీని పరిశీలిస్తున్న ఏడీఏ సునీత, ఏవో ఖాదర్ హుస్సేన్ తదితరులు

జమ్మికుంట: రాష్ట్ర ప్రభుత్వం అందించే యూరియాను దశలవారీగా కొరత లేకుండా పీఏసీఎస్, మన గ్రోమర్ ఎరువుల కేంద్రాల ద్వారా అందిస్తున్నట్లు, రైతులు అధైర్యపడొద్దని హుజూరాబాద్ ఏడీఏ గుండా సునీత అన్నారు. బుధవారం పట్టణంలోని మన గ్రోమోర్ ఎరువుల దుకాణంలో ఏవో ఖాదర్ హుస్సేన్‌తో కలిసి యూరియా పంపిణీ పరిశీలించారు. మాచనపల్లి గ్రామంలో తిరుపతిరెడ్డి అనే రైతు వరి పొలంలో నానో యూరియా పిచికారీ సందర్శించారు. ఏఈవోలు రాజేశ్, అచ్యుత్, రైతులు పాల్గొన్నారు.

కాంగ్రెస్, బీజేపీ ధర్నా చేయడం సిగ్గుచేటు



మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ నాయకులు

చిగురుమామిడి: రాష్ట్రంలో, కేంద్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్, బీజేపీ నాయకులు రైతులకు కావాల్సిన యూరియా ఇవ్వకుండా వారే వేర్వేరుగా ధర్నా, రాస్తారోకో నిర్వహించడం సిగ్గుచేటైన విషయమని బీఆర్‌ఎస్ నాయకులు విమర్శించారు. బుధవారం చిగురుమామిడిలో విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో మోసపూరిత వాగ్దానాలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ నాయకులు 420 హామీలను పట్టించుకోకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. కేంద్రంలో మూడోసారి అధికారంలోకి వచ్చిన బీజేపీ నాయకులు సంవత్సరానికి 2లక్షల ఉద్యోగాలు ఇస్తామని మోసపూరితంగా వాగ్దానాలు చేశారని అన్నారు. బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు మామిడి అంజయ్య, మండల ఉపాధ్యక్షుడు మిట్టపెల్లి మల్లేశం, మండల ప్రచార కార్యదర్శి బెజ్జంకి రాంబాబు, చిగురుమామిడి గ్రామ అధ్యక్షుడు ఆకవరం శివప్రసాద్, మాజీ ఎంపీటీసీ కత్తుల రమేశ్‌యాదవ్, మైనార్టీ సెల్ మండల అధ్యక్షుడు ఎండీ సర్వర్‌పాషా పాల్గొన్నారు.

మున్నూరు కాపు సంఘాన్ని బలోపేతం చేయాలి



సభ్యత్వ నమోదు ప్రారంభిస్తున్న నాయకులు

చొప్పదండి: పెద్ద మొత్తంలో సభ్యత్వం తీసుకోవడం ద్వారా మున్నూరు కాపు సంఘాన్ని బలోపేతం చేయాలని రాష్ట్ర ఉపాధ్యక్షుడు కనకం అమర్‌బాబు పటేల్ కోరారు. కొలిమికుంటలో బుధవారం సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు. మండల అధ్యక్షుడు మహేందర్, శ్రీనివాస్, తిరుపతి, సంతోశ్, సునీల్‌కుమార్, అశోక్, కోటేశ్, సురేశ్, రమేశ్, తిరుపతి, శ్రీనివాస్, చంద్రయ్య, లక్ష్మణ్, తిరుపతి, రాజు తదితరులు పాల్గొన్నారు.

చీరలు పంపిణీ



చీరలు అందిస్తున్న జగదీశ్వర్

శంకరపట్నం: మధ్యాహ్న భోజనం కార్మికులకు బుధవారం గంగిశెట్టి మధురమ్మ మెమోరియల్ ట్రస్ట్ నిర్వాహకుడు జగదీశ్వర్ చీరలు పంపిణీ చేశారు. కొత్తగట్టు, కేశవపట్నం, మొలంగూర్, ఏరడపల్లి, తాడికల్ జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలతోపాటు కరీంపేట, వంకాయగూడెం పాఠశాలల్లో పని చేస్తున్న కార్మికులకు చీరలు అందజేశారు. హెచ్‌ఎంలు నీరజ, సుభాశ్, రామస్వామి, వైష్ణవి, సుధారాణి, శ్రీధర్ పాల్గొన్నారు.

బిగ్ డిబేట్‌ను జయప్రదం చేయండి



మాట్లాడుతున్న రత్నం రమేశ్

కరీంనగర్: పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను విడుదల చేయాలని, విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ జార్జిరెడ్డి పీడీఎస్‌యూ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ఈనెల 15న ఉస్మానియా యూనివర్సిటీలో జరిగే బిగ్ డిబేట్‌ను జయప్రదం చేయాలని జార్జిరెడ్డి పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు రత్నం రమేశ్ కోరారు. బుధవారం సంఘ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. విద్యను అభివృద్ధి చేస్తామని చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం.. అదే విద్యను కేవలం ప్రైవేటీకరణ, కార్పొరేటీకరణ చేసేలా వ్యవహరిస్తోందని మండిపడ్డారు. నవీన్, రాము, కిరణ్, విష్ణు, శివ, రాకేశ్, రామకృష్ణ, సందీప్, శ్రీమాన్ తదితరులు పాల్గొన్నారు.

కల్వర్టు మూసివేతపై ఫిర్యాదు

శంకరపట్నం: గొల్లపల్లి శివారులో నూతనంగా నిర్మిస్తున్న పెట్రోల్ బంక్ నిర్వాహకులు కల్వర్టు మూసేశారని హుజూరాబాద్ ఆర్డీవోకు బుధవారం కొత్తగట్టు గ్రామానికి చెందిన గరిగే రంజిత్ అనే రైతు ఫిర్యాదు చేశాడు. కార్యదర్శి, ఎంపీడీవో, తహసీల్దార్ అనుమతులు లేకుండా నిర్మించారని ఆరోపించారు.

పోస్టులు పెట్టిన వారిపై కేసు

వీణవంక: కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఎక్కటి రఘుపాల్‌రెడ్డిపై సోషల్ మీడియాలో అనుచిత పోస్టులు పెట్టిన వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఆవుల తిరుపతి తెలిపారు. ఎలాంటి ఆధారాల్లేకుండా పార్టీల మధ్య చిచ్చు పెడుతూ గొడవలు జరిగేలా పోస్టులు పెట్టిన చరణ్‌రావు, బండ కిషన్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డిపై అదే గ్రామానికి చెందిన బావు రాకేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

దరఖాస్తులు ఆహ్వానం

శంకరపట్నం: కేశవపట్నం కేజీబీవీలో ఔట్ సోర్సింగ్ ప్రాతిపదికన హెడ్ కుక్, అసిస్టెంట్ కుక్, స్వీపర్ పోస్టులకు మహిళలు ఈనెల 12 లోపు మండల వనరుల కేంద్రంలో దరఖాస్తులు చేసుకోవాలని ఎంఈవో లక్ష్మీనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. హెడ్ కుక్ విద్యార్హత ఎస్సెస్సీ, అసిస్టెంట్ కుక్, స్వీపర్‌కు 7వతరగతి ఉండాలన్నారు.